క్లుప్తంగా

గీజర్లు బహూకరణ



గీజర్లు అందిస్తున్న నాయకులు

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ గురువారం రెండు గీజర్లను బహూకరించారు. విద్యార్థులు తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను అభ్యర్థించారు. ఎమ్మెల్యే సూచన మేరకు మహేశ్ పాఠశాలకు గీజర్లను అందజేశారు. ఈ సందర్భంగా టీచర్లు ఏఎంసీ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, బండారి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

జమ్మికుంట: మత్తు పదార్థాలకు బానిసకావొద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి అన్నారు. మండలంలోని గంద్రపల్లి కేజీబీవీలో గురువారం సైబర్ నేరాలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డ్రగ్స్, గంజాయి బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. సెల్‌ఫోన్ వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రులకు సైతం తెలియజేయాలన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

కమిషనర్‌కు వినతి

హుజూరాబాద్: పట్టణంలోని సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ పీవీ సేవా సమితి, సిద్ధార్థనగర్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాలనీ అధ్యక్షుడు సాగి వీరభద్రారావు, పీవీ సేవాసమితి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సంపత్‌రెడ్డి, బి.మనోజ్, కాసర్ల శ్రీహరి, రావుల తిరుపతిరెడ్డి, పసులస్వామి తదితరులున్నారు.

వారసంత ప్రారంభం



వారసంతను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలో నూతనంగా కూరగాయల వారసంతను పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ గురువారం ప్రారంభించారు. వారసంతతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్, పోశాల శ్రీనివాస్, మూల ప్రభాకర్, జక్కే కిరణ్, శ్రీనివాస్, చంద్రమౌళి, రమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి



సభ్యత్వాలు అందజేస్తున్న సృజన్‌కుమార్

రామడుగు: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యాడ సృజన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని గుండి, దేశరాజ్‌పల్లి, మోతె, గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతిగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, నాయకులు రమేశ్, మహబాబ్ సాజీద్, మోజేశ్, నర్సయ్య, లక్ష్మణ్, సురేందర్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం రాత్రి ఎక్లేసియా మినిస్ట్రీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. వేడుకలకు అంతర్జాతీయ వర్తమాని బిషప్ డేనియల్ డి.కల్యాణరావు హాజరై ఏసు సందేశం వినిపించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్స్ ఏసుదాసు, రెవరెండ్ డాక్టర్ పీఆర్ నెల్సన్, ప్రేమ్‌కుమార్, ఆనంద్, మార్క్, సామ్సన్ జాషువా, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి

- తక్కువ వేగంతో, ఖచ్చితమైన దూరం పాటించాలి
- రంగారావు, రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్





చలికాలంలో రాత్రి సమయంలో, వేకువ జామున వాహనాలు జాగ్రత్తగా నడపాలి. ఎదురుగా వచ్చేవారికి స్పష్టంగా కనిపించేలా లైట్లను ఆన్‌చేసి ఉంచాలి. లోబీ మ్ ఫాగ్‌లైట్లు ఉండేలా చూసుకోవాలి. తక్కు వ వేగంతో వెళ్లాలి. వాహనాల మధ్య ఖచ్చితమైన దూరం పాటించాలి. విండ్ స్క్రీన్, సైడ్ మిర్రర్లపై ఎప్పటికప్పుడు మంచును శుభ్రం చేయాలి. కారు, ఇతర పెద్ద వాహనాల్లో అద్దంపై మంచు పొర కమ్ముకోకుండా డీఫ్రాస్టర్ వినియోగించాలి. రోడ్లు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనం నిలిపివేయడం మంచిది. అది ఇతర వాహనాలకు కనిపించే విధంగా ఉండాలి. పొగమంచు దృష్ట్యా రాత్రి 10.30నుంచి ఉదయం 7వరకు దూర ప్రయాణాలు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు రాత్రి ప్రయాణం చేయొద్దు. పెద్దవాహనాలు, ట్రక్కులు రోడ్డు పక్కన నిలపకూడదు. సరైన జాగ్రత్తలు పాటించి, క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలి.

బహిరంగ ప్రదేశాల్లో ఉంచొద్దు

- ఓవర్ కూల్ అయి బ్యాటరీ డ్రెయిన్ అవుతుంది
- దినేశ్, మొబైల్ టెక్నీషియన్





కొద్దిరోజులుగా చలి విపరీతంగా పెరుగుతోంది. చలికాలం నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మొబైల్స్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువసేపు ఉంచవద్దు. దీనికారణంగా ఓవర్ కూల్ కావడంతో పాటు బ్యాటరీ డ్రెయిన్ అవుతుంది. ఎలక్ట్రానిక్ కంపోనెట్స్ తేమ వచ్చి చెడిపోయే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితీరు మందగిస్తుంది. అదే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాలను హీటింగ్ పరికరాలకు దగ్గరగా ఉంచవద్దు. అది మొబైల్స్ పనితీరును ప్రభావితం చేస్తుంది. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగిసుకపోయే అవకాశం ఉంటుంది. మొబైల్ బాగా వేడయితే స్విచ్ఛాఫ్ చేయడం ఉత్తమం. మైనస్ టెంపరేచర్ ఉన్న సందర్భంలో కంప్యూటర్ల బ్యాటరీ, కంట్రాక్టులు సైతం ప్రభావితం అవుతాయి. మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం చాలావరకు తగ్గించుకోవాలి.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్పపడి పూజలో దీక్షాస్వాములు



చొప్పదండి: విరాళం అందిస్తున్న దాత

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం అయ్యప్పపడి పూజ నిర్వహించారు. వంకాయగూడెం అయ్యప్పస్వామి ఆలయ పూజారి సుమన్‌శాస్త్రి, గురుస్వామి చింతం సత్యనారాయణ ఆధ్వర్యంలో మాలధారుడు కొండపాక నరేశ్ మహాపడిపూజ కార్యక్రమం జరిపించారు.

మత్స్యగిరీంద్రస్వామి హుండీ లెక్కింపు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి హుండీ ఆదాయం రూ.1,44,144 వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి తెలిపారు. ఎనిమిది నెలల్లో మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకున్న భక్తులు హుండీలో వేసిన కానుకలను గురువారం ఆలయంలో భక్తుల సమక్షంలో లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో సుధాకర్, అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ. 54 వేల విరాళం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అన్నదాన ట్రస్టు ఏర్పాటుకు పట్టణానికి చెందిన కటకం కమల జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు గురువారం రూ. 54,054 విరాళం ప్రకటించారు. కటుకం భూమయ్య, రమాదేవి మల్లికార్జున్, సాయిరాం ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్‌గౌడ్‌కు విరాళం అందించారు. పట్టణానికి చెందిన తాడూరి రాజేశ్వరి, వెంకటి, రామకృష్ణ, శివకృష్ణ రూ.5,116 ఆలయ అభివృద్ధికి అందజేశారు. కార్యక్రమంలో చేపూరి సత్యనారాయణ, దండె సత్యానందం, మునీందర్, ఎలిగేటి రాములు, పారండ్ల భాస్కర్, బత్తిని ప్రశాంత్, మరిమడ్ల రాజిరెడ్డి, దూస రాము, శివా రెడ్డి, తదితరులున్నారు.



హుండీ లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు, తదితరులు

నూతన కమిటీలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, గద్దపాక, మొలంగూర్‌లో బీజేపీ బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి తెలిపారు. అధ్యక్షులుగా బొజ్జ కుమార్, నాగవెల్లి జగదీష్, దాసారపు తిరుపతి, పొద్దుటూరి వెంకన్న, రెడ్డి రమణారెడ్డి, జంగ సతీశ్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకట్‌రెడ్డి, దండు కొంరయ్య, నరేందర్, దొంగల రాములు, శ్రీనివాస్ ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో బీజేపీ బూత్ కమిటీ ఎన్నికలు పార్టీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి బుర్ర శ్రీనివాస్, మండల దళితమోర్చా అధ్యక్షుడు సాగర్, నాయకులు గూల్ల కిష్టయ్య, గూల్ల రాజు, ఎన్నం సంతోష్, గూల్ల సాయికృష్ణ పలువురు పాల్గొన్నారు.

నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న వేణు

హుజూరాబాద్: పట్టణానికి చెందిన రాచర్ల వేణును జాతీయ మానవ హక్కుల కమిటీ మండలాధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాయవాది సుంకనపల్లి రాములు నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి ప్రణయ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినపల్లి నగేశ్, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పులుగు లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణానికి చెందిన సిలువేరు శ్రీకాంత్‌ను చేనేత పద్మ సమైక్య రాష్ట్ర ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ రామ్మోహన్ గురువారం నియామకపత్రం అందజేశారు. పట్టణానికి చెందిన కులబాంధవులు, పలువురు నాయకులు శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో గురువారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా పాక అశోక్, ప్రధాన కార్యదర్శిగా జి.వనజ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు నెరువట్ల చైతన్య హాజరై మాట్లాడారు. పండితుల సమస్యల పరిష్కారానికి సంఘం పని చేస్తుందని, భాషా పండితులకు ప్రమోషన్లు వచ్చేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం మండలశాఖ సభ్యులను సన్మానించారు. ఈకార్యక్రమంలో కరుణాకర్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, భూపేందర్, భేగ్, రాజవీరు, కళ్యాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ శివారులో ఉప కాలువ గడ్డి, పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది. యాసంగిలో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, కాలువలో సిల్ట్, గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కవిత, డీఈ, ఎస్సారెస్పీ, సెల్ నంబర్: 91778 12458

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సమస్యలను పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్మన్ వేణుగోపాలాచారి

మానకొండూర్: విద్యుత్ వినియోగదారులు, రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వరంగల్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూటర్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఎస్వీ వేణుగోపాలాచారి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు గ్రామాల్లోని సమస్యలను విన్నవించి దరఖాస్తులు అందించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను రోడ్డుకిరువైపులా దూరంగా వేయాలన్నారు. కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నప్పుడు అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. అధికారులకు సమాచారం లేకుండా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఒకచోటు నుంచి మరోచోటుకు మార్చవద్దన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ కె.రమేశ్, ఫైనాన్స్ మెంబర్ ఆర్. చరణ్‌దాస్, మెంబర్ రామారావు, ఎస్సీ రమేశ్‌బాబు, డీఈ తిరుపతి, ఏడి శ్రీనివాస్, ఏఈలు సత్యనారాయణ, లక్ష్మణమూర్తి, వీరాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఇంగ్లిష్‌పై భయాన్ని వీడాలి**

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఆంగ్ల భాషపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్, భవన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోకెన్ ఇంగ్లిష్ నిర్వాహకుడు జి.దామోదర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఇంగ్లిష్‌పై మొదట భయాన్ని వీడాలని, బేసిక్ టెక్నిక్స్ తెలిస్తే సులభంగా ఇంగ్లిష్‌ను నేర్చుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ వి.అంజనేయరావు, ఇంగ్లిష్ లెక్చరర్ ఆర్.రజిత, అధ్యాపకులు ఉన్నారు.

- **రాష్ట్ర స్థాయి టెస్టు, పోటీలకు ఎంపిక**

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి కె. రిష్మిత జిల్లా స్థాయి బయోసైన్స్ ఫోరమ్ నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రిష్మితను ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, సైన్స్ టీచర్ సుజాత, బయోసైన్స్ ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మీరాజం, ప్రధాన కార్యదర్శి కోల రమేశ్ అభినందించారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని మైనారిటీ గురుకుల విద్యాలయం విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. ఆయేషా సిద్ధిఖీ, శివాత్మిక, దీపాంజలి, నస్రా ఫిర్దోస్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నస్రా ఫిర్దోస్, 800 మీటర్ల పరుగు పందానికి శివాత్మిక ఎంపికైందన్నారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

- **పాఠశాల సందర్శన**

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీఈవో జనార్దన్‌రావు సందర్శించారు. మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు.

- **స్కూల్ కాంప్లెక్స్ సమావేశం**

రామడుగు: రామడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సాంఘికశాస్త్రం మూడో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజం అభివృద్ధిలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుల పాత్ర ప్రధానమని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం పద్మజ, ఆర్పీలు అవదూత శ్రీనివాస్, వెల్మల రవీందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

- **ఎస్సీ జాబితాలో చేర్చాలి**

జమ్మికుంట: ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య జుడీషియల్ కమిషన్‌కు తెలంగాణ పంబాల కులవృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. పంబాల కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చి కులధ్రువీకరణ పత్రాలు, 57 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్, జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలని కుల స్థితిగతులపై నివేదిక అందజేశారు.

- **గ్రానైట్‌లారీ– ఆటో ఢీ**

శంకరపట్నం: గ్రానైట్ లారీ– ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ కుటుంబంతో పాటు మరికొన్ని కుటుంబాలు వేములవాడ రాజన్న దర్శనం కోసం ఆటోలో బయలుదేరారు. వంకాయగూడెం గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్‌లారీ– ఆటో ఢీకొన్నాయి. డ్రైవర్‌తోపాటు, ముందు సీట్లో కూర్చున్న సూర్యప్రకాశ్ చేయి విరిగింది. మరో ఇద్దరికి గాయాలు కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకుని 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

- **నేలకొరిగిన స్తంభాలు**

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ శివారుప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. గురువారం కూలీలు రోడ్డు విస్తరణలో భాగంగా భూమి చదును చేస్తుండగా విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా నేలకొరిగాయి. ఘటన సమయంలో రోడ్డు వెంబడి ప్రజలు, వాహనదారులు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపడుతున్నాడని గ్రామస్తులు, సమీపంలోని రైతులు ఆరోపించారు.

- **జిలెటిన్ స్టిక్స్ పట్టివేత**

జమ్మికుంట: జిలెటిన్ స్టిక్స్ తరలిస్తుండగా టౌన్ సీఐ రవి గురువారం రాత్రి పట్టుకున్నారు. వివరాలు.. అనుమతి లేకుండా 17 జిలెటిన్ స్టిక్స్‌ను హుజూరాబాద్ పట్టణనికి చెందిన కోదాల నరసింహ, మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన వరికొప్పుల నవీన్ తరలిస్తున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

- **పరామర్శ**

ఇల్లందకుంట: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్యాల గ్రామానికి చెందిన గీతకార్మికుడు బొమ్మ రవిగౌడ్‌ను సర్వాయిపాపన్న మోకు దెబ్బ గౌడసంఘం నాయకులు గురువారం పరామర్శించారు.

మడిపల్లి వాసికి చేంజ్ మేకర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

జమ్మికుంట: హుస్నాబాద్ మున్సిపల్‌లో పనిచేస్తున్న ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్, మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన డి. రవికుమార్ చేంజ్ మేకర్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీ సిల్లర్‌హాక్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎస్ఈ డైరెక్టర్ సునీత గురువారం అవార్డు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అవార్డు వచ్చింది. మాజీ సర్పంచ్ ముగల పర్శరాములు, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ,మాజీ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు నాగపూరి విక్రమ్, గ్రామస్తులు రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

టీబీ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కృష్ణకాలనీలో డాక్టర్ చందన ఆధ్వర్యంలో గురువారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి ప్రాణాంతకం కాదని, రెండు వారాలకు మించి దగ్గు, తెమడ, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలన్నారు. టీబీ లక్షణాలు, వ్యాధి వ్యాపించు విధానం, తీసుకోవాలిస్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఆశాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'కల్వల'కు మరమ్మతు చేయాలి

వీణవంక: కల్వల ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయింది. మరమ్మతు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. ప్రాజెక్టు దిగువన ఎంతో మంది రైతులు పంటలు పండిస్తున్నారని, మినీ ఎల్ఎండీగా మార్చాలని గతంలో సుమారు రూ.70కోట్ల మేర ఎస్టిమేషన్ వేశామని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రాజెక్టు దిగువన వీణవంక, జమ్మికుంట మండలాల పరిధిలోని గ్రామాలున్నాయని అన్నారు. వెంటనే స్పందించిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాజెక్టుపై పునరాలోచించి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ప్రకటించారు. మూడు మండలాలకు వరప్రదాయినిగా మారిన కల్వల ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చించడం పట్ల ఆయా మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లిన కౌశిక్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్య పరిష్కరించాలి



గన్నేరువరం: మండలంలోని చొక్కారావుపల్లెలో కొంతమంది రైతులకు ధరణి వల్ల జరిగిన తప్పిదాన్ని సవరించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం అసెంబ్లీలో రెవెన్యూశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 1958 నుంచి రైతులు పట్టా కలిగి ఉన్నారని, 163 ఎకరాల పట్టా భూముల్లో 153 ఎకరాలు ధరణి వల్ల నిషేధిత జాబితాలో చూపెడుతున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు ఆందోళన చెందుతున్నారని, అవసరాల నిమిత్తం భూములను విక్రయించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యను పరిష్కరించాలని గత ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, ధరణి తప్పిదాలను ప్రభుత్వం వెంటనే సవరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. హరితహారం, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటికల కోసం తీసుకున్న దళితుల భూములను తిరిగి దళితులకు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రస్తావించారు.

క్వింటాల్ పత్తి 7,150

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి రూ.7,150 పలికింది. క్రయవిక్రయాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

హుజూరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల, కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని, కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

జమ్మికుంట: అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అర్పించిన అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదని వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ డిమాండ్ చేశారు.

శంకరపట్నం: అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని కేశవపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సుధీర్ పాలాభిషేకం చేశారు.

రామడుగు: రామడుగులో అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

పోలీసుల అదుపులో మాలమహానాడు నాయకులు

హుజూరాబాద్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో హుజూరాబాద్ నుంచి నాయకులు తరలి వెళ్తున్నారనే సమాచారంతో గురువారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబు, మాల ఉద్యోగుల సంఘం నాయకులు సతీష్,పసుల స్వామి,కోడిగుటి ప్రవీణ్ ఉన్నారు.

చొప్పదండి: పట్టణంలో మాల మహానాడు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాల మహానాడు కార్యకర్తలు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు.

ఇల్లందకుంట: మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిన అదే తీరు కొనసాగుతుందన్నారు. నాయకులముందస్తు అరెస్టును ఖండించారు. గత ప్రభుత్వ వైఖరినే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని విమర్శించారు.